నిబంధనలు గాలికి...

- నంబర్‌ప్లేట్లపై నాయకుల పేర్లు
- వాహనదారుల ఇష్టారాజ్యం
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు

కొత్తకోట రూరల్: ద్విచక్ర వాహనాలకు ముఖ్యమైన నంబర్‌ప్లేట్‌ను 'నా నంబర్..నా ఇష్టం' అనే విధంగా కొందరు వాహనదారులు మార్చేస్తున్నారు. నంబరు వాహనానికి గుర్తింపుతో పాటు వాహనదారుడి చిరునామా తెలిపే నంబర్ ప్లేట్‌ను నిబంధనల ఉల్లంఘనలకు పరాకాష్టగా, కొందరి నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ప్రమాదాల సమయంలో క్షతగాత్రుల వివరాలు అందించేందుకు వీలైనట్లు ఉండే నంబర్ ప్లేట్లు పోలీసులకు చిక్కు సమస్యగా మారుతోంది. అంకెలు ఉండాల్సిన చోట అభిమాన నాయకుడి, నటుడి ఫొటో, బొమ్మ, హోదా ఉంటోంది. ఐతే వాహనదారుడి ముద్దు పేరు, లేదా వారు సభ్యులుగా ఉన్న రాజకీయ పార్టీ చిహ్నం ఉంటుంది. నంబరుప్లేట్లను ఇలా నిబంధనలకు విరుద్ధంగా మార్చేస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరిగిపోతోంది. నంబరుప్లేట్లు సక్రమంగా లేకుంటే చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు, రవాణాశాఖ అధికారులు పూర్తి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. నంబర్ ప్లేట్లలో నంబరు వెతికినా కనిపించని పరిమాణంలో రాయించుకుని మిగిలిన భాగంలో బొమ్మలతో రాసి ఉన్న స్టిక్కర్లతో తిరిగే వాహనాల సంఖ్య పెరిగిపోతోంది. వాహనం రిజిస్ట్రేషన్ సమయంలో రవాణా శాఖ అధికారులు సూచించిన విధంగా హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లు తీసుకుంటున్న వాహనదారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తమకు ఇష్టమైన విధంగా నంబరు ప్లేట్లు మార్పు చేసుకుంటున్నారు. ఇటీవల కాలంలో మరింత ఎక్కువగా దర్శనమిస్తున్నాయి.

హై సెక్యూరిటీ ప్రయోజనాలు..

హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వాహనం ప్రమాద సమయంలో కుటుంబసభ్యులకు సమాచారం అందించేందుకు దర్యాప్తునకు ఎంతగానో ఉపయోగపడుతుంది. పోలీసు నిఘా సీసీ కెమెరాలతో వాహనం చోరీకి గురైతే సులువుగా వాహనం ప్రయాణించే మార్గాన్ని గుర్తించి స్వాధీనం చేసుకునే అవకాశాలున్నాయి. కొత్తనంబరు ప్లేట్లపై పూర్తిస్థాయిలో సమాచారం లభ్యమవుతోంది. హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్లను తొలగించి, నచ్చిన రీతిలో నంబర్ ప్లేట్లు బిగిస్తే ప్రమాదాలు జరిగినప్పుడు స్పష్టత లేకపోవడంతో ఆచూకీ కష్టమవుతోందని సంబంధిత విచారణ అధికారులు అంటున్నారు.



కొత్తకోటలో స్కూటీ వెనుక నంబర్ ప్లేట్‌పై పిఠాపురం ఎమ్మెల్యే తాలుక అని రాసివున్న దృశ్యం

నిబంధనలు ఇలా..

రవాణాశాఖ సూచించిన హై సెక్యూరిటీ నంబర్ ప్లేట్ తప్పనిసరిగా వాహనానికి ఏర్పాటు చేసుకోవాలి. వాహనం వెనక రెండు వరుసల్లో సంఖ్య వేయాలి. వాహనం ముందు భాగంలో నంబర్ ప్లేట్‌పై అక్షరాలు 30మి.మీ ఎత్తులో, నంబర్లు 35మి.మీ ఎత్తులో 7మి.మీ దూరం ఉండాలి. వెనుక బోర్డుపై అంకెల్లో 40మి.మీ ఎత్తు, 7మి.మీ అంకెల మధ్య 5మి.మీ దూరం ఉండాలి. వాహన సామర్థ్యాన్ని బట్టి నంబరు బోర్డు కొలతలు ఉంటాయి. యంత్రం సామర్థ్యం 70సీసీ లోపు వాహనాలపై ప్రతి అంకె 15 మి.మీ ఎత్తు 25 మి.మీ అంకెలమధ్య 25 మి.మీ దూరం ఉండాలి. వ్యక్తిగత వాహనాల నంబరు బోర్డు పూర్తిగా తెలుపు రంగులో ఉండాలి. అక్షరాలు మాత్రం నలుపురంగులో ఉండాలి. రవాణా చేసే వాహనాలకు, అద్దె ప్రాతిపదికన నడిచే వాహనాలకు నంబరు ప్లేటు పూర్తిగా పసుపు రంగులో ఉండి నలుపు అక్షరాలు ఉండాలి.

తప్పనిసరిగా పాటించాలి



ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి. హై సెక్యూరిటీ నంబరు ప్లేట్లను ఉపయోగించాలి. నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేస్తే జరిమానా విధిస్తాం. పలు మార్లు తప్పిదం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రవాణాశాఖ సూచించిన విధంగానే బైక్‌లకు, కార్లకు, లారీలకు నంబరు ప్లేట్లు ఉండాలి.

– మానస, జిల్లా రవాణా అధికారి, వనపర్తి

నంబర్ కనబడేలా ఉండాలి



బైక్ నంబర్ ప్లేట్స్‌పై నంబర్ లేకుండా ఇష్టం వచ్చినట్టు నాయకుల పేర్లతో పాటు ఇతర పిచ్చి రాతలు ఉంటే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి. బైక్‌పై నంబర్ ఉంటే ఏదైనా ప్రమాదాలు జరిగితే వెంటనే గుర్తు పట్టేందుకు అవకాశం ఉంటుంది. అంతే కాకుండా చోరీకి, గుర్తైనా, ఎవరైనా ఏ తప్పు చేసిన బైక్ ఎవరిపేరు మీద ఉంటుందో వెంటనే గుర్తించవచ్చు.

– పాండురంగయ్య, రాయిణిపేట గ్రామం, కొత్తకోట మండలం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడాకారులకు సన్మానం



పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థినులు సాయిపూజ, శృతి రాష్ట్రస్థాయి కబడ్డీ జూనియర్ జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు హర్షిస్తూ సోమవారం ఎమ్మార్సీ కార్యాలయంలో పీడీ శ్యామలను, ఇద్దరు విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను ఎంఈఓ శ్రీనివాసులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదరణ ఉన్న చోటే పోటీ చేస్తాం



వీపనగండ్ల: స్థానిక ఎన్నికల్లో ప్రజాదరణ ఉన్న చోట పోటీ చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలను మోసం చేసేందుకే అమలు నోచుకోని హామీలను ఇస్తూ.. ప్రజలను పలుమార్లు మోసం చేస్తున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. శ్రీరామ్, రమేశ్, శ్రీహరి, కురుమయ్య, సుబ్బయ్యశెట్టి పాల్గొన్నారు.

కొత్తతండాను పంచాయతీగా మార్చాలి

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో కొనసాగుతున్న పాతతండా నుంచి కొత్తతండాను విడదీసి గ్రామ పంచాయతీ చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు తిరుపతినాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రెండు పంచాయతీల్లో కలిసి సుమారు రెండువేల జనాభా ఉన్నారని అలాగే ఓటర్ల వారీగా చూస్తే కొత్తతండాలో 500పైగా ఓటర్లున్నారన్నారు. కొత్తతండాను పంచాయతీ చేయడంతో పాటు గోపాల్‌పేట మండలంలో కలపాలని డిమాండ్ చేశారు. తండావాసులు రేవల్లి మండలానికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొత్తతండాను పంచాయతీగా మార్చాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం రూపంలో అందించామని తెలిపారు.

జిల్లా రైస్‌మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి



కొత్తకోట రూరల్: నూతన సివిల్ సప్లయర్స్ కమిషనర్‌ను వనపర్తి జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ సభ్యులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిసినట్టు జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి అసోసియేషన్ ప్రతినిధులు రాష్ట్రంలో రా రైస్ మిల్లర్ల సమస్యలను, అవసరాలను పరిష్కరించాల్సిన అంశాలను తీసుకొచ్చినట్టు వారు తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి తగినచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి వూట్కూరి వీరేశం, కోశాధికారి విశ్వనాథం వెంకటరమణతో పాటు రాష్ట్రకార్యవర్గ సభ్యులు, జిల్లాల రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉన్నారు.

రోగులకు వైద్యపరీక్షలు

వీపనగండ్ల: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం 102 మందికి వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించారు. వివిధగ్రామాల నుంచి వచ్చిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమున్న రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, వంశీకృష్ణ, విజయకుమారి, రామచంద్రమ్మ పలువురు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సన్మానం

వనపర్తి విద్యావిభాగం: గ్రూప్–2 పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన యువకుడిని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన సదుర్ల బాలమణి రామస్వామి కుమారుడు సదుర్ల నవీన్ ఇటీవల జరిగిన గ్రూప్–2 పరీక్షల్లో 627వ ర్యాంక్ సాధించి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి వారి ఇంటికి వెళ్లి నవీన్‌కు సన్మానించారు. కార్యక్రమంలో గట్టుయాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, కంచ రవి, రవిప్రకాష్ రెడ్డి, మోహన్, చిన్న ఉన్నారు.

ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి: రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ సెక్రటరీలతో ఎన్నికల షెడ్యూల్, ప్రవర్తన నియమావళిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తన నియమావళి వెంటనే అమల్లోకి వచ్చినందున అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో మొదటి 24గంటల్లోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల పరిధిలో, 48 గంటల్లో బహిరంగ ప్రదేశాల్లో, 72 గంటల్లోపు ప్రైవేట్ ప్రదేశాల్లో ఏ విధమైన హోర్డింగ్స్, పోస్టర్లు, రాజకీయపార్టీ సంబంధిత చిత్రాలు లేకుండా తొలగించే విధంగా ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు ఇప్పుడు అసిస్టెంట్ ఎలక్షన్ అథారిటీలుగా వ్యవహరిస్తారన్నారు. అన్నిగ్రామాల్లో పోలింగ్‌కేంద్రాలు సందర్శించి అక్కడ కనీస మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేదా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా మౌలిక సదుపాయాలు లేకపోతే ఆయా పోలింగ్‌కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పీఓలు, ఓపీఓలకు శిక్షణ ఇవ్వడానికి అన్నిరకాలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్ రెవెన్యూ ఎస్.ఖీమ్యానాయక్, అదనపు కలెక్టర్ లోకల్‌బాడీస్ యాదయ్య, ఆర్డీవో సుబ్రమణ్యం, డీపీఓ రఘునాథ్, నోడల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హిందుత్వం మతం కాదు.. జీవన విధానం



మదన్‌గుప్తాను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొత్తకోట రూరల్: హిందుత్వం మతం కాదు.. జీవన విధానం అని తెలంగాణ ప్రాంత గోసేవా ప్రచార ప్రముఖ్ మదన్‌గుప్తా అన్నారు. సోమవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డి పల్లిలో నిర్వహించిన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. భారతదేశం చుట్టూ ఉన్న పలు దేశాల్లో సంక్షోభం కొనసాగుతున్న ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పూర్వ సేవకుల నాయకత్వంలో మన దేశం బలమైన ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకొంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, అత్యవసర పరిస్థితుల్లో సైన్యంతో సమానంగా దేశ సేవ చేసేందుకు సంఘ్ సేవకులు ముందుంటారని తెలిపారు. ఆదిశంకరాచార్య, ఛత్రపతి శివాజీ, వివేకానంద లాంటి మహాత్ములు, హిందూ మతం పరిరక్షణకు దిశా నిర్దేశం చేశారని కొనియాడారు. అంతకముందు గ్రామ శివారులోని వైరాలగుట్టపై ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మన్నెపురెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, కిరణ్‌కుమార్ రెడ్డి, నాగేందర్‌రావు, యాదవరెడ్డి, లక్ష్మారెడ్డి, సంఘ్ సేవకులు, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

900 బస్తాల యూరియా పంపిణీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సోమవారం 900బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ తెలిపారు. కార్యాలయానికి యూరియా వచ్చిందనే విషయంలో తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో కార్యాలయానికి 20రోజుల క్రితం ఇచ్చిన పేర్లతో ముందుగా ఆయా రైతులకు టోకెన్లను పోలీసుల పర్యవేక్షణలో అందజేసి యూరియాను పంపిణీ చేసినట్లు సీఈఓ పేర్కొన్నారు.



సింగిల్‌విండో కార్యాలయం ఎదుట యూరియా కోసం రైతులు

రైతుల అభ్యున్నతికే ప్రత్యేక రుణాలు



సింగిల్‌విండోలో రైతులకు చెక్కు అందజేస్తున్న చైర్మన్ కె.మురళీధర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రైతుల అభ్యున్నతి కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి ప్రత్యేకంగా రుణాలు ఇస్తామని పీఏసీఎస్ చైర్మన్ కె.మురళీధర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్‌లో సోమవారం మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కోరిక మేరకు ఇప్పటివరకు 46మంది రైతులకు కర్షకమిత్ర రుణాలు, రూ.4.70 కోట్ల నిధులు, 30మంది రైతులకు వ్యవసాయ రుణాలు రూ.30లక్షలు ఇస్తున్నామన్నారు. వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతుల కోసం యూరియా, డీఏపీ తదితర ఎరువులను ప్రభుత్వం సూచించిన ధరలకు అందించడం జరుగుతుందని చెప్పారు. రైతులు, ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి సహకారంతో ప్రత్యేకంగా దృష్టి సారించి నూతనంగా భవనం, గోదాంను నిర్మించుకున్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ క్యామరాజు, డైరెక్టర్లు సాయిచరణ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, నక్కకృష్ణయ్య, ఎదిరె నారాయణ, భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్యాంసుందర్‌రెడ్డి, రాములు, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, ఆడిటర్ భీక్యానాయక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజావాణిలో అర్జీలు ఫుల్ పరిష్కారాలు నిల్'

వనపర్తి: కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి అర్జీలు ఫుల్‌గా వస్తున్నా పరిష్కారం ఆశించిన మేరకు కావడం లేదని అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్ ఆరోపించారు. జిల్లా అస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విషయంలో చోటుచేసుకున్న అక్రమాలపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా కలెక్టర్ చర్యలు తీసుకోవడంలో ఎందుకు కాలయాపన చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఇదే విషయమై మూడోసారి ప్రజావాణి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ప్రజావాణి అర్జీలపై అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి వస్తున్నా అర్జీలు ఎలా ఉన్నాయి.. పరిష్కారం చేసిన వాటిపై చర్చించాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ఆయనతోపాటు నాయకులు గణపురం కృష్ణ, దయానంద్, జీటీ శ్యామ్, యాదయ్య తదితరులు ఉన్నాయి.

రేషన్ దుకాణాల్లో నిత్యావసర సరుకులు ఇవ్వాలి

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా 9రకాల నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వాలు వినియోగదారులకు ప్రజా పంపిణీ చౌకధరల దుకాణం ద్వారా తొమ్మిది రకాల నిత్యవసర వస్తువులైన బియ్యం, చక్కెర, మంచినూనె, కందిపప్పు, గోధుమలు, ఉప్పు, గోధుమపిండి, చింతపండు, కిరోసిన్ పంపిణీ చేసేవారని తెలిపారు. దసరా, దీపావళి, క్రిస్మస్, రంజాన్ పండుగల రోజుల్లో అదనంగా చక్కెర, మంచినూనె వినియోగదారులకు అందించేవారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో బిల్డింగ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, రాములు, నర్సింహులు, శేఖర్, నాగన్న, రాజు, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్

నిధుల మంజూరుపై హర్షం

కొత్తకోట రూరల్: కొత్తకోట మున్సిపాలిటీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.15 కోట్ల నిధులను మంజూరు చేయడంపై స్థానిక కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఎంతగానో కష్టపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే బోయేజ్ అన్నారు. సోమవారం విలేఖరులతో మాట్లాడుతూ.. ఇటీవల రూ.15కోట్లు పట్టణ అభివృద్ధి కోసం మంజూరైన నిధులతో పట్టణం ఎంతో సుందరంగా మారనుందన్నారు. డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణ కోసం రూ.6కోట్లు, శనిగ చెరువు కట్ట అభివృద్ధికి, సంత బజార్ ఏర్పాటు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణకోసం రూ.5కోట్లు, అదేవిధంగా పట్టణంలోని పార్కుల అభివృద్ధికి రూ.2కోట్లు, చెట్లఅభివృద్ధి, బీడీఎస్ ప్లాంటేషన్ కోసం రూ.50లక్షలు, ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న మురుగు కాల్వలు, రోడ్ల మరమ్మతుల కోసం రూ.1.50కోట్లు మంజూరు చేశారన్నారు. అంతేకాకుండా పట్టణంలో బాలుర ఎస్సీ కళాశాల హాస్టర్ వసతిగృహం మంజూరు, బీసీ బాలుర వసతి గృహం భవనం నిర్మాణ కోసం నిధులు చేయాలని, బాలికల వసతి గృహం భవనం నిర్మించాలని ఎమ్మెల్యే జీఎమ్మార్ మంత్రులను కలిశారని గుర్తుచేశారు. నిరంతరం నియోజవర్గ అభివృద్ధికోసం కృషి చేస్తున్న జీఎమ్మార్‌కు కొత్తకోట పట్టణ ప్రజలు రుణపడి ఉంటారన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌జే బోయేజ్

రక్త నమూనాల సేకరణ



పాన్‌గల్: మండలంలోని జమ్మాపూర్ గ్రామంలో పీహెచ్‌సీ వైద్యబృందం ఆధ్వర్యంలో అనుమానితుల నుంచి సోమవారం రక్త నమూనాలను సేకరించినట్లు పీహెచ్‌సీ వైద్యులు డా.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరపీడిత అనుమానితుల నుంచి రక్త నమూనాలను సేకరించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎపీడమాలజిస్టు వై ద్యులు సుమిత్‌రెడ్డి, వైద్యసిబ్బంది రాంచందర్, మ దన్‌గోపాల్, రమాదేవి, శైలాజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుల తల్లిగా.. ఆదిశక్తి



ఖిల్లాఘనపురం: మానాజీపేటలో అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు



అమరచింత కాళీకాలయంలో సరస్వతిదేవిగా అమ్మవారు



ఆత్మకూర్ : ఆరేపల్లి గ్రామంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గోపాల్‌పేటలో దుర్గామాతను దర్శించుకున్న మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో సోమవారం సరస్వతీదేవిగా అమ్మవారిని భక్తులు అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశామని నిర్వాహకులు మధు తెలిపారు.

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాళీకామాత, శ్రీవిఘ్నేశ్వర భవానినగర్‌లో అమ్మవారిని సోమవారం సరస్వతిదేవిగా అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. జమ్ములమ్మ, శివచాడేశ్వరి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత సరస్వతిమాతగా అలంకరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మండల అధ్యక్షుడు బాలరాజు, కర్రొళ్ళ స్వప్నభాస్కర్, రాజేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఆత్మకూర్ వాల్మీకినగర్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, కేశవస్వామి, స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో అలాగే ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరి మాతా బాలబ్రహ్మేశ్వరస్వామి, కోట్లాంజనేయ స్వామి, అష్టలక్ష్మి ఆలయంలో, వాల్మీకినగర్‌లో, బీసీకాలనీలో సోమవారం సరస్వతిదేవిగా అలంకరించారు.

పల్లెల్లో బతుకమ్మ సంబరాలు



ఈర్లదిన్నెలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, విద్యార్థినులు

అమరచింత: మండలంలోని గ్రామాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలతో పాటు అమ్మవారి మండపాల వద్ద మహిళలు రాత్రివేళలల్లో బతుకమ్మలతో ఆడిపాడారు. పూలపండుగ విశిష్టతను తెలియపరిచే విధంగా రంగురంగుల పూలను ఒక్కచోట చేర్చి మహిళలు, యువతులు కలిసి కోలాటం, బొడ్డెమ్మలతో ఆడిపాడుతూ సరదాగ గడుపుతున్నారు.

గోపాల్‌పేట: మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో సోమవారం మెడికల్ ఆఫీసర్ కృష్ణకుమారి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలతో బతుకమ్మలు తయారుచేసి బతుకమ్మ పాటలు పాడుతూ బొడ్డెమ్మలు కొట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొసల్య, ఫార్మాసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేట పీహెచ్‌సీలో బతుకమ్మ సంబరాల్లో సిబ్బంది

నిరుపయోగంగా సామూహిక మరుగుదొడ్లు



అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో రూ.5లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డి నిరుపయోగంగా ఉండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారైంది. గత మూడేళ్ల కిందట కాలనీ మహిళల కోసం నిర్మించిన మరుగు దొడ్డిని శుభ్రపరిచే వారు లేకపోవడంతో దుర్గంధంగా ఉందని మహిళలు ఎవ్వరు వీటిని వినియోగించు లేకపోవడంతో మరుగున పడింది. గత ఏడాది కిందట వీటి మరమ్మతుల కోసం రూ.లక్ష వెచ్చించినట్లు పురపాలిక అధికారులు లెక్కలు చూపిస్తున్న నేటికీ మరుగుదొడ్డి మరుగునపడి ఉంది. ఉన్నతాధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

గిరిజన సంప్రదాయాలను కాపాడాలి

పాన్‌గల్: గిరిజన సాంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్, ఐద్వా మహిళసంఘం జిల్లా నాయకురాలు అనిత అన్నారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో గిరిజన సంఘం, ఐద్వా మహిళసంఘం ఆధ్వర్యంలో నృత్యాలు, కోలాటాలు, పాటలతో పాటు బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. అనంతరం మహిళలకు బహుమతులను అందజేశారు.

మీకు సాక్షి దినపత్రిక అందదంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి ఎం. జగదీశ్వర్ - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ ఐ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి — పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

జబ్బర్ లాల్ : 9553955603